ఆటపాటలతో కూడిన విద్యను అందించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తూ చదువుపట్ల ఆసక్తిని పెంపొందించాలని ప్రముఖ విద్యావేత్త పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్వీ కేంద్రంలో బృందావన్ ప్రీస్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి ఉట్టిపడేలా చేసిన నృత్యం సభికులను ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ సంతోష్‌లక్ష్మి, కరస్పాండెంట్ ఎస్ వేణుగోపాల్, విద్యావేత్త రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాధిక, శ్వేత పాల్గొన్నారు.

రంగరాజు గౌడ్ మృతి బాధాకరం



కవాడిగూడ: కవాడిగూడ గౌడ సంఘం చైర్మన్‌గా రంగరాజ్‌గౌడ్ గౌడ సామాజికవర్గానికి ఎనలేని సేవలు అందించారని ఆయన మృతి గౌడ కులస్తులకు తీరని లోటని కవాడిగూడ టాపర్స్ కోఆపరేటీవ్ సొసైటీ అధ్యక్షుడు దూడల శంకర్‌గౌడ్ అన్నారు.

◆ రంగరాజు గౌడ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. రంగరాజుగౌడ్ సంతాప సభను ఆదివారం కవాడిగూడలో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు అంజయ్య గౌడ్, మద్దెల చంద్రయ్య గౌడ్, లింగాల ప్రకాష్‌గౌడ్,సూర్యనారాయణ గౌడ్, ప్రతాప్‌గౌడ్, సంపత్‌కుమార్ గౌడ్, ప్రకాష్‌గౌడ్, నవీన్‌గౌడ్, జహంగీర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలోని ప్రసిద్ధిగాంచిన సంజీవహనుమాన్ దేవాలయ నూతన కమిటీ అధ్యక్షుడిగా సీతామార్కండయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కాలనీ సర్వసభ్య సమావేశంలో పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా దావ్ మచ్చేంద్రనాథ్, జితేందర్, ప్రధాన కార్యదర్శి పుండరీకం, సంయుక్త కార్యదర్శి బి.వినోద్, కార్యనిర్వహక కార్యదర్శి ఎ.వెంకటేష్, కోశాధికారి గడ్డం నవీన్, సలహాదారులుగా బింగి కృష్ణ, ఆర్.ఆంజనేయులు, శ్యామల పద్మలను ఎన్నుకున్నారు.

కార్యకర్త పాడె మోసిన ఎమ్మెల్యే కాలేరు



నల్లకుంట: బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కె.శ్యామ్ అంత్యక్రియలు ఆదివారం జరిగాయి. కాచిగూడ హిందూ శ్మశానవాటిక వరకు కొనసాగిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని పాడె మోసారు. అంతమయాత్రలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, బస్తీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పగలే వెన్నెల..



ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయం చుట్టు పక్కల ప్రాంతాల్లో 30 నుంచి 40 విద్యుత్ దీపాలు నెల రోజులుగా నిరంతరాయంగా వెలుగుతున్నాయి. స్థానికులు సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పగటి పూట కూడా స్ట్రీట్ లైట్స్ వెలగడంతో ప్రజాధనం వృథా అవుతుందన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మతసామరస్యానికి ప్రతీక గ్యార్వీ



ముషీరాబాద్: ముస్లింలు పవిత్రంగా జరుపుకునే గ్యార్వీ వేడుకలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని బాపూజీనగర్‌లోని జమ్‌జమ్ మసీదు వద్ద మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో గ్యార్వీ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జెండాను ఆవిష్కరించి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.



దాశరథి, ఆరుద్ర మహాకవులు

• ప్రముఖ విమర్శకులు తెలకపల్లి రవి • మహాకవుల సాహిత్యం నేటి సమాజానికి ఎంతో అవసరం
• ఎస్వీ కేంద్రంలో ఘనంగా దాశరథి, ఆరుద్ర శత జయంతి వేడుకలు





సుందరయ్యవిజ్ఞానకేంద్రంలో జరిగిన వేడుకలో దాశరథి, ఆరుద్రల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అతిథులు, మాట్లాడుతున్న తెలకపల్లి రవి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆధునిక తెలుగు సాహిత్య రంగంలో తమ కవిత్వంతో ఓ వినూత్న శకాన్ని సృష్టించిన మహాకవులు దాశరథి, ఆరుద్రలని వారి సాహిత్యం నేటి సమాజానికి ఎంతో అవసరం అని ప్రముఖ విమర్శకులు కవి తెలకపల్లి రవి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ ఆధ్వర్యంలో దాసరథి, ఆరుద్ర శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

◆ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలకపల్లి రవి మాట్లాడుతూ... అవినీతికి, అరాచక పాలనకు ఎదురుతిరిగి తన కులాన్నే ఆయుధంగా ఎక్కుపెట్టి సింహగర్జన చేసిన మహాకవి దాశరథి అని అన్నారు. అగ్నిధార, రుద్రవీణ, తిమిరంతో సమరం వంటి కవితాసంపుటాలు దాశరథి కవితా వేశాన్ని చాటి చెపుతాయన్నారు. కుషీకుషీగా అంటూ ఎన్నో సినిమా పాటలు రాసి వెండితెరపే తన ముద్రను వేశారన్నారు.

మహాకవుల శతజయంతి ఉత్సవాలు నిర్వహించడం హర్షణీయం..

◆ తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి మాట్లాడుతూ... ఇలాంటి మహాకవుల శత జయంతి ఉత్సవాలు నిర్వహించడం హర్షణీయమని అన్నారు. ప్రముఖ విమర్శకులు కవి ఆర్.సీతారాం మాట్లాడుతూ... దాశరథి, ఆరుద్ర రాసిన సాహిత్య లోతుల్లోకి వెళ్లి పరిశోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితీ ప్రధాన కార్యదర్శి కె.ఆనందాచారి, హైదరాబాద్ బుక్‌ఫెయిర్ అధ్యక్షుడు యాకుబ్, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాలేశ్వరం శంకరం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరునగరి శరత్‌చంద్ర, డాక్టర్ శివరాత్రి సుధాకర్, అనంతోజు మోహన కృష్ణ, డాక్టర్ గంజి శశిధర్, తంగిరాల చక్రవర్తి, సలీమ తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్ర రాసిన కావ్యాన్ని ప్రచురించిన దాశరథి..

తెలంగాణ పోరాట దృక్పథంతో త్వమేవాహం వంటి కావ్యాన్ని రాసిన మహాకవి డాక్టర్ ఆరుద్ర అని దానిని ప్రచురించింది దాశరథి అని గుర్తు చేశారు. సమాగ్రాంధ్రా సాహిత్యం ఆయనను గొప్ప పరిశోధకుడిగా నిలబెట్టిందన్నారు. వేమన, గురజాడలపై ఆయన రాసిన విమర్శ గ్రంథాలు గొప్ప విమర్శకుడని తెలియజేస్తాయని అన్నారు. ఊహలు గుసగుసలాడే అంటూ వెండితెరపై తన పాటల సంతకాలు చేసిన గొప్ప కవి ఆరుద్ర అని కొనియాడారు.

వర్గీకరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా. వీఎల్ రాజు



సమావేశంలో డాక్టర్ వీఎల్ రాజు, వడ్లమూరి కృష్ణ స్వరూప్ తదితరులు

కాచిగూడ: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వీఎల్ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణగూడలోని మాల మహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రాజ్యాంగం నిబంధనలను దిక్కరించి వర్గీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఓటు బ్యాంకు వర్గీకరణ రాజకీయాలను అడ్డుకోవాలన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మాక్వానాకు విజ్ఞప్తి చేశారు. 338 ఆర్టికల్, క్లాజ్ 9 ధిక్కరించి వర్గీకరణ చేపడుతున్న కాంగ్రెస్‌పై చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్రపతికి సిఫార్సు చేయాలని ఎస్సీ కమిషన్‌ను కోరినట్లు వారు తెలిపారు.

స్టే ఇవ్వాలని హైకోర్టులో రిట్ పిటిషన్ వేశాం..

ప్రభుత్వం చేపడుతున్న వర్గీకరణ చర్యలపై స్టే ఇవ్వాలని హైకోర్టులో రిట్ పిటిషన్ వేశామని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న వర్గీకరణ చర్యలకు వ్యతిరేకంగా న్యాయ పోరాటం చేయాలన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎస్సీ రిజర్వేషన్ల శాతాన్ని 15 నుంచి 20 శాతానికి పెంచుతూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 12వేల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల సమగ్ర అభివృద్ధికి ఉద్దేశించిన సబ్‌ప్లాన్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్, వల్లం సురేష్, నక్కా దేవేందర్ రావు, అక్కిదాసరి రవీంద్రబాబు, సి.సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మంలో వివాహ వ్యవస్థ చాలా గొప్పది

ఎస్వీ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్



పురస్కార గ్రహీతలతో ఆచార్య కొలకలూరి ఇనాక్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, వెంకటరాంరెడ్డి

చిక్కడపల్లి: సనాతన ధర్మంలో వివాహ వ్యవస్థ చాలా గొప్పదని శ్రీవేంకటేశ్వర(ఎస్వీ) విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శిఖరం ఆర్ట్ థియేటర్స్, రఘు అరికపూడి సేవా ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో కళా తపస్వి పద్మశ్రీ డాక్టర్ కె.విశ్వనాథ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన మన్నెం వెంకటరాంరెడ్డి, డాక్టర్ గీతానాగశ్రీ , డాక్టర్ యం.అమరేష్, బింగి జ్యోతి , బింగి నరేందర్‌గౌడ్, వేణారి మంజుల, వేమూరి అనంతరామకృష్ణ, దస్తగిరి, హసీనాజాన్ ఆదర్శ దంపతులకు పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. జీవితాంతం ఒకరికొకరు తోడు నీడలా మెలుగుతూ ఇతరులకు ఆదర్శంగా జీవించాలన్నారు. టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. కళతపస్వి కె. విశ్వనాథ్ జీవితం ఆదర్శనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు దైవజ్ఞ శర్మ, చక్రపాణి, అరికపూడి రఘు, జి.కృష్ణ, లలిత తారావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణస్థాయి నుంచి 'చెస్'ను అభివృద్ధి చేయాలి

తెలంగాణ డెమోక్రటిక్ చెస్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు



ఇందిరాపార్కులో నిరసన వ్యక్తం చేస్తున్న చెస్ క్రీడాకారులు

కవాడిగూడ: తెలంగాణలో గ్రామీణ స్థాయి నుంచి చెస్ క్రీడను అభివృద్ధి చేయాలని తెలంగాణ డెమోక్రటిక్ చెస్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు కంది రవి, అమిత్‌పాల్ సింగ్, మహేందర్, రాజ్‌కుమార్, నరేష్, శ్రీహరి కోరారు. ఇటీవల రాష్ట్ర చెస్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా కాకుండా చెస్ క్రీడాకారులకు స్థానం కల్పించకుండా కొందరు వ్యక్తులు ఏకపక్షంగా వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చెస్ క్రీడాకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ డెమోక్రటిక్ చెస్ డెవలప్‌మెంట్ కమిటీ, హైదరాబాద్ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో చెస్ ఆడుతూ శాంతియుత పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెస్ క్రీడాకారులకు స్పాన్సర్‌షిప్‌లను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డెమోక్రటిక్ సెటప్ చెస్ గవర్నెన్స్‌లో ఉత్తమ ప్రతిభావంతులకు పారదర్శకంగా ఆర్థిక సహాయం అందించాలని కోరారు. చెస్ క్రీడా నిర్వహణలో ప్లేయర్, ఫ్రెండ్లీ వాతావరణం నెలకొల్పాలని అన్నారు. క్రీడాకారులు, కోచ్‌లు, ఆర్బిటర్లు తల్లిదండ్రులతో రెగ్యులర్ ఇంటరాక్షన్ కార్యక్రమాలను నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. చెన్నై, కోల్‌కత్తాతో సమానంగా తెలంగాణలో చెస్ క్రీడా సంస్కృతిని పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలి

ముషీరాబాద్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని... రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 30శాతం నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేసింది. విద్యానగర్ మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో జాతీయ నాయకులు పి.మహేష్, మంద నవీన్, కె.శ్రీనివాస్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 15నెలలైనా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌కు ఇవ్వలేదన్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.7500 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మూసీ ప్రక్షాళన పేరిట కోట్లాది రూపాయలను వెచ్చించి రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం దారుణమని అన్నారు. ఈ చర్యతో పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఓయూ నాయకులు ఆసిఫ్, మౌనిక, గౌతమ్, రూబీన్స్, జాహ్నవి, రహీం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'శివ భక్తి సుధ'



నల్లకుంట: ఆధ్యాత్మిక చింతనతోనే మెరుగైన సమాజం ఏర్పడుతుందని గుల్బర్గా దూరదర్శన్ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. శివరాత్రిని పుస్కరించుకొని సాహితి జిగీష సాహితి, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో 'శివ భక్తి సుధ'కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ... నేటి యువత ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడంపై మక్కువ చూపాలన్నారు. సాహితీ ప్రభావ దత్తాత్రేయ శర్మ, వక్తలు డాక్టర్ హనుమంతయ్య, పాల్కుర్కి సోమనాథుడు, ఆచార్య సాగి కమలాకర శర్మ, శ్రీనాథుడు, డాక్టర్ పి. లలిత వాణి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సంస్థల అప్పుడు వైఎస్‌ఆర్ మూర్తి మృతి



చిక్కడపల్లి: అంతర్జాతీయ సాంస్కృతిక సేవా సంస్థ వైజ్ మెన్స్ క్లబ్‌లో వివిధ హోదాలలో బాధ్యతలు నిర్వర్తించిన వైఎస్‌ఆర్‌గా పేరు పొందిన వై.శ్రీరామచంద్రమూర్తి ఆదివారం ఉదయం మృతిచెందారు. కొంత కాలంగా గుండె సంబంధిత వ్యాధితో ఆయన బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు సంతాపం తెలిపారు. సైదాబాద్‌లో సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు కేటాయించాలి



ఇందిరాపార్కు ధర్నాచౌక్ నిరసన తెలుపుతున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

కవాడిగూడ: మున్నూరుకాపు కార్పొరేషన్‌కు రూ.2000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని మున్నూరుకాపు సామాజిక వర్గానికి మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని మున్నూరుకాపు రాష్ట్ర సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ... మున్నూరుకాపులకు రాజకీయంగా, మంత్రివర్గంలో స్థానం కల్పించాలన్నారు. మున్నూరుకాపు సంక్షేమ భవనానికి రూ.20కోట్ల నిధులు కేటాయించి డిమాండ్ చేశారు. కోకాపేటలో నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు ఎడ్ల రవిపటేల్, మున్నూరుకాపు యువత విభాగం అధ్యక్షుడు వనమాల ప్రవీణ్ పటేల్, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు ఆర్.దశరథ్‌పటేల్, మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలశ్రీనివాస్ పటేల్, ఆర్.ఏ దశరతం, మహేందర్, డాక్టర్ పీఎస్‌ఎల్ పటేల్‌తో పాటు మున్నూరుకాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు దోచిపెట్టే హక్కు మోదీకి ఎక్కడిది.?



ఎన్‌పీఆర్‌డీ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పేదల సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే హక్కు మోదీకి ఎక్కడిదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.వీరయ్య ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌ను సవరించి సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో నిధుల పెంపుకోసం పెద్ద ఎత్తున పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల కొనుగోలు శక్తిని పెంచని బడ్జెట్ ఎందుకోసమని ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమ పథకాలకు నిధుల కోత పెట్టిన మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న ప్రజల అవసరాలను తీర్చే విధంగా బడ్జెట్ లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షుడు కె. వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య, ఆర్.వెంకటేష్, సాయమ్మ, జయరాజు, స్వామి, యశోద, కోశాధికారి ఆర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో పఠనాశక్తిని పెంపొందించాలి



ఎస్వీ కేంద్రంలో జరిగిన లైబ్రరీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వేదకుమార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పిల్లల్లో బాల్యం నుంచే పఠనాశక్తిని పెంపొందించే విధంగా ప్రోత్సహించాలని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ వ్యవస్థాపకుడు ఎం. వేదకుమార్ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో పిల్లల లైబ్రరీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రులు పిల్లల చదువుపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పిల్లలకు మంచి కథలు, కథనాలు వివరించడంతో పాటు గొప్పగొప్పవారి చరిత్రను తెలియజేయాలన్నారు. అప్పుడే దేశం గర్వించదగ్గ పౌరులుగా తీర్చిదిద్దవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు కె. సుజావతి, డాక్టర్ టి. నళినీ, ఎస్ వినోద్‌కుమార్, కార్యదర్శి ఎస్ సోమయ్య, బ్రాహ్మణి తదితరులు పాల్గొన్నారు.

నిషాన్ యాత్ర..



శ్రీశ్యామ్ మందిర్ 30వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిషాన్ యాత్ర చేపట్టారు. కాచిగూడ వీరన్నగుట్టపై వెలిసిన శ్రీ శ్యామ్‌మందిర్‌లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.వేడుకల్లో కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి దంపతులు, ఆలయ కమిటీ ప్రతినిధులు ఇంద్రకుమార్ అగర్వాల్, రాజ్‌కుమార్ విగ్, రామ్‌దేవ్ అగర్వాల్, పురుషోత్తం పాల్గొన్నారు. – కాచిగూడ





ఘనంగా ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ జయంతి



పీసీ సర్కార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలుగు రాష్ట్రాల ఇంద్రజాల ప్రముఖులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తన అద్భుతమైన ప్రదర్శనల ద్వారా భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత ఇంద్రజాలికుడు ప్రదీప్‌చంద్ర (పీసీ) సర్కార్ అని తెలుగు రాష్ట్రాల ఇంద్రజాల ప్రముఖులు పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ ఇంద్రజాలికుడు పీసీ సర్కార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ మెజీషియన్స్ ప్రతినిధి రామడుగు వసంత్ అధ్యక్షత వహించగా ఇంద్రజాలికులు ఆంజనేయులు, ప్రదీప్ రంగరేజ్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం కార్యదర్శి కె.వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం

• బీసీ మేధావుల ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు • కుక్కింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ మహాసభ



సదస్సులో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, బీసీ మేధావుల ఫోరం చైర్మన్ చిరంజీవులు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కుక్కింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ 5వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాలను శ్రమ దోపిడీకి గురిచేయడం సరికాదన్నారు. రాజ్యాంగంలో అంబేడ్కర్ కల్పించిన కార్మిక చట్టాలను అమలు చేయడంలేదు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

తమిళనాడులో పటిష్టంగా కార్మిక చట్టాల అమలు...

◆ తమిళనాడులో కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేస్తున్నారని తెలిపారు. గ్యాస్ డెలివరీ చేసే వారికి దేశవ్యాప్తంగా రూ.30 కమీషన్ అమలులో ఉంటే అంతకన్న తక్కువగా ఇవ్వడం శ్రమ దోపిడేనని అన్నారు. కార్మిక సంఘాలు పటిష్టంగా ఉండి, తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. అగ్రకులాలకు ఉపయోగపడే ఏ చట్టాలైనా ఆగమేఘాల మీద అమలు చేస్తున్నారే కానీ కార్మిక వర్గ చట్టాలను పట్టించుకోవడం లేదని వాపోయారు.

◆ ప్రముఖ ప్రజా ఉద్యమ నేత డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఇంకా కార్మికుల హక్కుల కోసం అడుక్కోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర సాధనలో కార్మికుల పాత్ర కీలకమైందన్నారు. తక్షణమే వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు మాట్లాడుతూ... శ్రమ దోపిడీ చేస్తున్న గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖకు ప్రత్యేక మంత్రి లేకపోవడం బాధాకరమని అన్నారు. వర్కర్స్ ట్రేడ్ యూనియర్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యమకారుడు మంగిలిపెల్లి శంకర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి బుర్ర చంద్రయ్యగౌడ్, ఉపాధ్యక్షులు ఎండీ యూసూఫ్, కోశాధికారి రమేష్, బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్లా లక్ష్మణ్, కేవీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.